ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 1 | పేజీలు: 11 | వెల: రూ.3/- | సోమవారం 20 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# కవితకు కొత్త జోష్..

## పార్టీ పెట్టకముందే క్యూ కడుతున్న నేతలు.. జాగృతిలోకి మాజీ ఎమ్మెల్యే



**హైదరాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

కొత్త పార్టీ పెట్టకముందే కల్వకుంట్ల కవిత వద్దకు నేతలు చేరుకుంటున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు.. జాగృతిలో చేరారు. ఇక మరో మాజీ ఎమ్మెల్యే కవితతో భేటీ అయి చర్చించారు. మరోవైపు.. ఇప్పటికే పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించి.. ఆ దిశగా కీలక అడుగులు వేస్తున్న కవితకు ఇలా నేతలు పార్టీలో చేరడం సరికొత్త ఉత్సాహాన్నిస్తోంది. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారు ఇప్పుడు అభివృద్ధి కోసం ఏకతాటిపైకి రావాలని కవిత పిలుపునిచ్చారు.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత .. తన కొత్త పార్టీ ఏర్పాటు ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. ఈనెల 25వ తేదీన తన కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేసిన కవిత.. దానికి సంబంధించిన ఏర్పాట్లు చూసుకుంటున్నారు. ఇప్పటికే కాశీ, అయోధ్య పర్యటన పూర్తి చేసుకున్న కవిత.. కొత్త పార్టీ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే తాను పెట్టనున్న పార్టీలోకి రావాలని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారులు, మాజీ మావోయిస్టులు, యువత, మేధావులకు ఇప్పటికే కవిత విజ్ఞప్తి చేశారు.

ఈ నేపథ్యంలోనే తాజాగా బోథ్ మాజీ ఎమ్మెల్యే.. కాంగ్రెస్ నేత రాథోడ్ బాపూరావు కవిత పార్టీలో చేరారు. ఆదివారం నాడు తన అనుచరులతో కలిసి హైదరాబాద్ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో.. జాగృతి కండువా కప్పి కవిత తన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్పందించిన కవిత.. రాష్ట్ర సాధన కోసం పని చేసిన నేతలంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న పార్టీలను వదిలేసి.. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా ఎదగనున్న జాగృతిలో చేరాలని విజ్ఞప్తి చేశారు.

2007లో కుటుంబంతో సహా తాను బోథ్ కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానన్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్పిరిట్ తో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్ఫూర్తితో పని చేయాల్సి ఉందన్నారు.

తెలంగాణ జాగృతి నుంచే రాథోడ్ బాపూరావు బీఆర్ఎస్‌లో చేరి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేసిన కవిత.. ఇప్పుడు తిరిగి జాగృతిలోకి వచ్చినట్లు తెలిపారు. తాను పెట్టనున్న కొత్త పార్టీలో చేరేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నేతలు వస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులంతా ఇప్పుడు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. కొత్త పార్టీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ..మిగతా 2లో



## మంత్రి అజారుద్దీన్‌కు

# 'ఆరు నెలల' గండం

## మంత్రి పదవి నిలిచేనా?

## గవర్నర్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పదవిని కాపాడుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో భేటీ అయ్యారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి ఆరు నెలల గడువు ఈ నెల 30తో ముగియనుండటమే దీనికి కారణం. గవర్నర్ కోటాలో అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ నియామకం ఫైల్ పెండింగ్‌లో ఉండటంతో ఉత్కంఠ నెలకొంది. మరో పది రోజుల్లో గెజిట్ విడుదల కాకపోతే అజారుద్దీన్ తన పదవిని వదులుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం గవర్నర్‌ను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఉదయం లోక్ భవన్‌కు వెళ్లిన సీఎం రేవంత్.. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఫైల్ గురించి చర్చించినట్లు సమాచారం. రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. చట్టసభ సభ్యుడు కాని వ్యక్తి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఆరు నెలల లోపు అసెంబ్లీ లేదా కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఈ నెల 30వ తేదీతో ఆరు నెలల గడువు ముగియనుంది. అంటే మరో పది రోజుల్లోపు ఆయన ఎమ్మెల్సీగా నియమితులు ..మిగతా 2లో

## 20న సీఎం రేవంత్

# మేడిగడ్డ సందర్శన

### నస్తూరపల్లిలో బహిరంగసభ

### 20న సీఎం రేవంత్ మేడిగడ్డ సందర్శన

### ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్ష

### కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం

### సాయంత్రం నస్తూరపల్లిలో బహిరంగసభ

### రెండవ విడత రైతుభరోసా నిధుల విడుదల



**హైదరాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 20వ తేదీ సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించ నున్నారు. సీఎం పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి మధ్యాహ్నం 1.45 గంటలకు ..మిగతా 2లో

# భానుడి భగభగలకు బ్రేక్..



### తెలంగాణలో 5 రోజులపాటు వర్షాలు..

### పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్

### హైదరాబాద్‌లో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన

### గాలివాన ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

### మేడ్చల్, రంగారెడ్డి సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండలు మండిపోగా, మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల వడగళ్లు కూడా పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈదురు గాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో ఒక భారీ చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. దీని ప్రభావంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ..మిగతా 2లో

## టీఎంసీ గుండాలు పది రోజుల్లో

# లొంగిపోవాలి

### మే 4 తర్వాత ఎవరినీ వదిలేది లేదు

### ప్రధాని మోడీ వార్నింగ్



**కోల్‌కతా, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై ప్రధాని మోదీ విరుచుకపడ్డారు. బెంగాల్‌లో అశాంతి సృష్టిస్తున్న టీఎంసీ గుండాలను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బెంగాల్‌లోని బిష్ణుపూర్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మే నాలుగు తర్వాత అవినీతిపరులు, గుండాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కనుక టీఎంసీ గుండాలు పదిరోజుల్లోపు తమంతట తామే పోలీసుల ఎదుట లొంగిపోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయన్నారు. బిష్ణుపూర్ మాఫియా, టీఎంసీ సిండికేట్ ఆటలు ఇకసాగవన్నారు. గత 15 ఏళ్లుగా పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ ఏవిధమైన అభివృద్ధి చేసిందో ప్రజలకు తెలియజేయాలన్నారు. టీఎంసీ విధానాలతో బెంగాల్ గుర్తింపు ప్రమాదకరంగా మారిందన్నారు. బెంగాల్ బ్రాండ్‌ను బీజేపీ ..మిగతా 2లో



## భవన నిర్మాణ రంగ

# కార్మికులకు పెన్షన్లు

### ఇందిరమ్మ ఇళ్లు, ప్రమాద బీమా..

### మంత్రి వివేక్ కీలక ప్రకటన

**హైదరాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

భవన నిర్మాణ రంగ కార్మికులకు మంత్రి వివేక్ శుభవార్త చెప్పారు. వారిని ఆదుకునేందుకు త్వరలోనే పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అందుకోసం తగిన చర్యలను చేపడుతున్నట్లు వివరించారు. త్వరలోనే లేబర్ బోర్డు ఏర్పాటు చేసి.. అన్ని రంగాల కార్మికులకు లేబర్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ప్రమాద బీమా అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు మంత్రి వివేక్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ రంగం సహా అన్ని రంగాల్లో పనిచేస్తున్న ..మిగతా 2లో



# 'చెన్నై సూపర్-6'..

## నగరం కోసం డీఎంకే ప్రత్యేక మ్యానిఫెస్టో

**చెన్నై, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓటర్లపై హామీల వర్షం కురిపించిన అధికార డీఎంకే పార్టీ.. తాజాగా చెన్నై వాసుల మనసులూ గెలుచుకునేందుకు ప్రత్యేక మ్యానిఫెస్టోను ప్రకటించింది. 'చెన్నై సూపర్-6' పేరిట నగర ఓటర్లను ఆకట్టుకునేలా పలు హామీలు తీసుకొచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పార్టీ ప్రధాన కార్యాలయంలో దీన్ని ఆదివారం ..మిగతా 2లో

# భానుడి భగభగలకు బ్రేక్..

**మొదటి పేజీ తరువాయి...**

ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం చూపింది. గత కొన్ని రోజులుగా మండిపోతున్న ఎండలకు కాస్త బ్రేక్ లభించనుంది. రాష్ట్రంలో 5 రోజుల పాటు వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడనున్నట్లు తెలిపింది. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. మరికొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇక అకాల వర్షాలకు చేతికొచ్చిన పంట నాశనం అవుతోందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం పూట అసలు ఇంటి నుంచి కాలు బయటపెట్టాలంటేనే జనం భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎండల వేడిమి నుంచి ఉపశమనం కలిగించేలా వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో వర్షాలు కురవనున్నట్లు తెలిపింది. తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు ఎండలతో మండిపోయిన తెలంగాణ కాస్తా చల్లబడనుంది. ఇప్పటికే పలు జిల్లాల్లో వడగళ్ల వానలు పడుతున్నాయి.ఇక అటు భానుడి భగభగలు.. ఇటు అకాల వర్షాలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఉక్కిరిబిక్కిరికి గురవుతున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం పూట భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా.. సాయంత్రం అయ్యేసరికి వాతావరణం పూర్తిగా మారిపోతోంది. ఒక్కసారిగా చల్లబడి, ఈదురు గాలులు, వడగళ్ల వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. చేతికొచ్చిన వరి పంట కాస్తా పొలాల్లోనే పడిపోయింది. ఇక పంట కోసి మార్కెట్‌కు తరలించిన ధాన్యం.. వర్షపు నీటికి కొట్టుకుపోవడం, తడిసిపోవడంతో ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.ఆదివారం రోజున నిర్మల్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ అధికారులు ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఇక జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కొమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సిద్ధిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇక ఇంతటి వర్షాల సూచన ఉన్నప్పటికీ.. మధ్యాహ్నం పూట ఉష్ణోగ్రతలు మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు. జగిత్యాల, ఆదిలాబాద్, కామారెడ్డి, కరీంనగర్, కొమురం భీమ్, జోగులాంబ గద్వాల్, మహబూబ్ నగర్, మెదక్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, నిజామాబాద్, నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో ఆయా జిల్లాలకు ఎండల తీవ్రత దృష్ట్యా ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.



మ్యాచర్ చెక్ చేస్తున్న జిల్లా కలెక్టర్

# సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

### పక్కాగా టోకెన్ విధానం అమలు కావాలి

### హన్మంతాపూర్,తరిగొప్పులలో కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

### మౌలిక వసతులపై సూచనలు

### రైతులకు వేచి ఉండే సమయం తగ్గించాలి

### చిల్పూర్ కేజీబీవీ పాఠశాల సందర్శన -- శుభ్రత, భోజనంపై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ


**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం):**

జిల్లాలోని నర్మెట్ట మండలంలోని హన్మంతాపూర్‌లో, తరిగొప్పుల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదివారం సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ నేపథ్యంలో కేంద్రాల్లో రైతులకు అందిస్తోన్న మౌలిక వసతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు.టోకెన్ విధానం అమలులో ఉందా? అనే అంశాన్ని పర్యవేక్షిస్తూ, నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు.కేంద్రాల్లో తాడిపత్రిలు, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా?అని పరిశీలించారు. టోకెన్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ధాన్యం తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని సూచించారు. అలాగే రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులను ఎక్కువ సేపు వేచి ఉండే పరిస్థితులు రాకుండా కాంటాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, రికార్డులను సరైన విధంగా నిర్వహించాలని సూచించారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ, విశ్రాంతి సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదనంతరం చిల్పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలను కలెక్టర్ సందర్శించి, పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీరు, అగ్నిమాపక భద్రత సదుపాయాలు, అదే విధంగా వంట గదిని పరిశీలించి, ఆహార తయారీ విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అనే విషయం గురించి ఆరా తీశారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను కూడా పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి కల్పించాలని, భోజన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధిగా

# గోపాలదాస్ ఉపేందర్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం):**



జిల్లా లోని లింఘాల ఘనపూర్ మండల కేంద్రంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ తాటికొండ రాజయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ లింగాల గణపురం మండల పార్టీ అధికార ప్రతినిధిగా మండలం లోని కుందారం గ్రామానికి చెందిన గోపాల్ దాస్ ఉపేందర్ ని నియమించారు. ఈసందర్బంగా గోపాల్ దాస్ ఉపేందర్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి అప్పగించిన రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి పెద్దలు తాటికొండ రాజన్న కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్నికకు సహకరించిన మండల ముఖ్య నాయకులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

### భవన నిర్మాణ రంగ

# కార్మికులకు పెన్షన్లు

**మొదటి పేజీ తరువాయి...**



కార్మికులను ఆదుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. అందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భవన నిర్మాణ రంగ కార్మికులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం భవన నిర్మాణ రంగం సహా అన్ని రంగాల కార్మికులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివేక్ తెలిపారు. మరీ ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని.. త్వరలోనే చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు.

రానున్న రోజుల్లో తెలంగాణలోని ప్రతి జిల్లాకు భవన నిర్మాణ కార్మికుల కోసం ఒక సంఘం భవనాన్ని కూడా నిర్మాణం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కృషి చేస్తున్నట్లు మంత్రి వివేక్ వెల్లడించారు. త్వరలోనే లేబర్ బోర్డు ఏర్పాటు చేసి.. రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు లేబర్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. అంతేకాకుండా కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు.. పెన్షన్లతోపాటు ప్రమాద బీమాను కూడా అందించేందుకు కావాల్సిన కార్యాచరణను త్వరలోనే రెడీ చేస్తామని మంత్రి వివేక్ భరోసా కల్పించారు.

# 'చెన్నై సూపర్-6'..

**మొదటి పేజీ తరువాయి...**

ఆవిష్కరించారు. నగరవాసుల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రత్యేక మ్యానిఫెస్టో తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. చెన్నై సూపర్-6లో ఆరు అంశాలను డీఎంకే ప్రస్తావించింది. నగరంలో సౌకర్యాలు మెరుగు పరచడం, వెయ్యి మినీ బస్సులు, ఏఐ సాయంతో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయం తగ్గించడం వంటివి ఇందులో ఉన్నాయి. నీటి కాలువలు, కీలక రహదారి ప్రాజెక్టులు పూర్తి చేయడం, రహదారుల వెంబడి చెట్ల పెంపకం, ప్రపంచ స్థాయి సదుపాయాల కల్పన వంటి హామీలు ఇచ్చింది. మెట్రో రైలు విస్తరణ, వీధి కుక్కల నియంత్రణ, వెటర్నరీ డాక్టర్ల సంఖ్యను మూడింతలు చేయడం, క్షేత్రస్థాయి సిబ్బంది పెంచడం వంటివీ జోడించింది. యువతను ఆకట్టుకోవడానికి రూ.10వేల కోట్ల టెక్నాలజీ హబ్ ఏర్పాటు వంటి హామీలు గుప్పించింది.

**ఎందుకు కీలకం?**

తమిళనాడులో ఎన్నికలు ఒక ఎత్తైతే రాజధాని చెన్నైలో పోరు మరో ఎత్తు. ఇక్కడ పట్టు సాధిస్తే ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సులువని రాజకీయ విశ్లేషకులు చెప్పే మాట. అందుకే అన్ని పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ క్రమంలోనే డీఎంకే ప్రత్యేక మ్యానిఫెస్టో తీసుకురావడం గమనార్హం. గ్రేటర్ చెన్నై పరిధిలోని 22 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో డీఎంకే ఏకంగా 20 స్థానాల్లో పోటీ చేస్తోంది. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మరో ముగ్గురు ఇందులో ఉన్నారు. ఎన్డీయేలో అన్నాడీఎంకే 18 చోట్ల బరిలోకి దిగగా.. టీవీకే అధినేత విజయ్ ఇక్కడ పోటీ చేస్తుండటంతో పాటు పలుచోట్ల అభ్యర్థులను బరిలో ఉంచింది. ఏప్రిల్ 23న తమిళనాట ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

### 20న సీఎం రేవంత్

# మేడిగడ్డ సందర్శన

**మొదటి పేజీ తరువాయి...**

హైదరాబాద్ లోని సీఎం నివాసం నుంచి బయలుదేరి 2.00 గంటలకు బేగంపేట్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.00 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.05 నుండి 3.25 గంటల మధ్య శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం చేసి, ఆలయం వద్ద భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. 3.30 గంటలకు కాళేశ్వరం నుంచి బయలుదేరి 3.45 గంటలకు మహాదేవపూర్ మండలం మేడిగడ్డకు చేరుకుంటారు. అక్కడ 3.45 నుండి 4.30 గంటల వరకు మేడిగడ్డ బ్యారేజ్ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. సాయంత్రం 4.35 నుండి 5.30 గంటల వరకు అంబట్‌పల్లి గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 5.35 నుండి 6.00 గంటల వరకు మీడియా సమావేశంలో పాల్గొంటారు. 6.00 గంటలకు మేడిగడ్డ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 6.30 గంటలకు కాటారం మండలం నస్తూరపల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ 6.30 నుండి 7.45 గంటల వరకు రైతు భరోసా పథకం రెండో విడత నిధులను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. తదుపరి రాత్రి 7.45 గంటలకు నస్తూరపల్లి నుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసానికి రోడ్డు మార్గంలో చేరుకుంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా యంత్రాంగం భారీ బందోబస్తుతో పాటు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. బహిరంగసభను జయప్రదం చేసేందుకు ప్రభుత్వం యంత్రాంగంతో పాటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా జనాన్ని సమీకరించే పనుల్లో నిమగ్నమయ్యారు.



# కవితకు కొత్త జోష్..

**మొదటి పేజీ తరువాయి...**

ఆదరణ ఉంటుందని వెల్లడించారు.తెలంగాణకు కవిత ముఖ్యమంత్రి కావాలని రాథోడ్ బాపూరావు ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడానికి కవిత ఇచ్చిన ధైర్యమే కారణమని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీలో తన తర్వాత వచ్చిన వారు కూడా మంత్రులు అయ్యారని.. కానీ తాను 2 సార్లు గెలిచినా మూడోసారి టికెట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినా తనకు సరైన ప్రాధాన్యత దక్కలేదని పేర్కొన్నారు. కొత్త పార్టీ పెట్టిన తర్వాత ఇచ్చోడలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. మరోవైపు.. సిరిసిల్ల జిల్లా నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నేతలు జాగృతిలో చేరినట్లు కవిత తెలిపారు. మరోవైపు.. ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్ట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్పీ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే లింగయ్య దొర కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో మతం కేటగిరిలో ఆదివాసీ అనే కాలమ్‌ను పెట్టలేదని.. దీంతో ఆదివాసీలు తామ మతాన్ని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి లేదని లింగయ్య దొర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది ఆదివాసీల సంస్కృతిని అవమానించడమేనని.. ఆదివాసీల కోసం జనగణనలో ప్రత్యేక కాలమ్ పెట్టాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. అదే సమయంలో భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఆదివాసీల భాష కోయతూర్‌ను చేర్చాలని కవిత డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న 12 కోట్ల మంది ఆదివాసీలు.. నిజమైన భారత దేశ సంస్కృతికి ప్రతినిధులు అని.. తమ కొత్త పార్టీలో ఆదివాసీల గౌరవాన్ని కాపాడుతామని హామీ ఇచ్చారు.

### మంత్రి అజారుద్దీన్‌కు

# 'ఆరు నెలల' గండం

**మొదటి పేజీ తరువాయి...**



కాకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంపిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంతో పాటు అజారుద్దీన్ పేరు ఉన్నప్పటికీ.. గవర్నర్ ఆ ఫైల్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ నెల 30 లోపు గవర్నర్ ఆమోద ముద్ర వేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయితేనే అజారుద్దీన్ మంత్రిగా కొనసాగే అవకాశం ఉంటుంది. పది రోజుల గడువు మాత్రమే మిగిలి ఉండటంతో ఈ లోపు సాంకేతిక ఇబ్బందులను తొలగించి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం గవర్నర్‌ను కోరినట్లు తెలుస్తోంది. గవర్నర్ సానుకూలంగా స్పందిస్తేనే అజారుద్దీన్ పదవి సురక్షితంగా ఉంటుంది, లేనిపక్షంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. ఇక 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ ఓడిపోయారు. అయితే ఆ తర్వాత 2025లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వటంతో పాటు అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న ముస్లిం మైనారిటీ ఓటర్లను ఆకర్షించడానికి, పార్టీ పట్టును బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావించారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. అయితే ఆ ఫైల్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో భేటీ కావటం ప్రాధాన్యత సంతరించుకుంది.

### టీఎంసీ గుండాలు పది రోజుల్లో

# లొంగిపోవాలి

**మొదటి పేజీ తరువాయి...**



కాపాడుతుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.అయితే అంతకుముందు లోక్‌సభలో లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయని పేర్కొన్నారు. దీనికి తగిన పర్యవసానాలను విపక్షాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని దేశ మహిళలకు ప్రతిపక్షాలు సమాధానం చెప్పుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు దేశ మహిళలను మోసం చేశాయని ఈ సందేశాన్ని దేశంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి గ్రామానికి చేరవేయాలని బీజేపీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించినట్లు తెలుస్తోంది

# హిందువులు సంఘటితం చేయడానికే హిందు సమ్మేళనం

**బాబుల్ రెడ్డినగర్ హిందూ సమ్మేళనంలో భాగ్యనగర్ విభాగ్ ఆర్ఎస్ఎస్ సహకార్యవాహ వర్కల క్రిష్ణ.**

**భారీ సంఖ్యలో హాజరైన బాబుల్ రెడ్డినగర్, మార్కండేయనగర్, సాయిబాబా నగర్, రామక్రిష్ణ హిల్స్ హిందువులు.**

**ఆకట్టుకున్న శ్రీవిద్యా నికేతన్ విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు.**





**రాజేంద్రనగర్ , ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

దేశంలోని హిందుత్వాన్ని సంఘటితం చేయడమే రాష్ట్రీయ స్వయం సేవక్ ఏకైక లక్ష్యమని భాగ్యనగర్ విభాగ్ ఆర్ఎస్ఎస్ సహకార్యవాహ వర్కల క్రిష్ణ ఉద్ఘాటించారు. హిందుత్వం ఎవరికి వ్యతిరేకం కాదని, సమాజమే సంఘం..సంఘమే సమాజం కావాలన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగత్ ఆకాంక్షతో సనాతన ధర్మం పరిరక్షణకు హిందువులను సంఘటితానికే హిందూ సమ్మేళనాలు దేశా వ్యాప్తంగా పండుగాల కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం బాబుల్ రెడ్డి నగర్ బొడ్డు రాయి కూడలిలో బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయనగర్, రామక్రిష్ణ హిల్స్, సాయిబాబా నగర్ హిందు బంధువల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ధర్మాచార్య పీఠం భాగ్యనగర్ కు చెందిన శ్రీ కమలేష్ దాస్ జీ మహారాజ్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న వర్కల క్రిష్ణ ఈసందర్భంగా మాట్లడుతూ హిందూ సమ్మేళనం సభకు పెద్ద సంఖ్యలో మాతృమూర్తులకు, సోదర ,సోదరీమణులకు, యువతీ, యువకులు హాజరకావడం సంతోషంగా ఉ ందన్నారు. ఈ సమ్మేళనం ఏ ఒక్కరికో వ్యతిరేకం కాదని, హిందువు తాను హిందువుగా తెలుసుకోవడంతో పాటు సంస్కృతిని గౌరవించుకోకునే ఆత్మీయ కలయిక అన్నారు. సనాతన ధర్మం మనకు నేర్పిన వసుధైక కుటుంబం మనది, ప్రపంచమంతా ఒకే కుటుంబం అనే స్ఫూర్తితోనే ముందుకు సాగాలన్నారు. వేల సంవత్సరాల నుండి ఈ నేల మీద ధర్మం, సత్యం, అహింస, కరుణ అనే విలువలు ఇంకా బతికే ఉన్నాయని, మనలో మనకు పడక మహ్మదీయులు, ఆంగ్లేయుల చేతుల్లో దేశం నలిగిన చరిత్రను గుర్తు చేశారు. తల్లిదండ్రులను దైవంగా చూడమని చెప్పిన సంస్కృతిని ఒంటబట్టించుకున్న వారు దేశాన్ని పరిరక్షించగలుగుతారనే సత్యాన్ని గ్రహించాలన్నారు. ప్రపంచలో ఎక్కడా లేని విధంగా ప్రకృతిని ఆరాధించడం హిందు సంస్కృతి యొక్క గొప్పతనమని తెలిపారు. ఈ కోవలో చెట్టుని, పుట్టని, నదిని, గోవుని దైవంగా భావించేది హిందువులు మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. అలాగే అతిథి దేవో భవ అని చెప్పి, ఇంటికి వచ్చిన వారిని ఆదరించమని నేర్పిన సంప్రదాయం కలిగిన భారయులుగా ప్రస్తుత యుద్ధం జరుగుతున్న దేశాలకు నేనున్నానని భారత దేశం ప్రపంచానికి చాటుతున్న వైనం మనం ఎవ్వరికి వ్యతిరేకం కాదని చెప్పకనే చెబుతుందని వెల్లడించారు. అదే భారతీయ హిందువుల సర్వే జనాః సుఖినో భవంతుగా నిత్యం ప్రార్థించే గొప్పతనమన్నారు. సామాజిక ఐక్యతోనే హిందుత్వం బలీయమైన శక్తగా ఎదుగుతుందని చెప్పారు. హిందూ ధర్మం ఎప్పుడూ "కలిసి బతుకు, కలిసి వృద్ధి చెందు" చాటుతుందని, ఇతరులకు కీడు చేయాలనే ఆలోచన చేయదని స్పష్టం చేశారు. చరిత్రలో గ్రామంలో గుడి కట్టాలన్నా, బడి కట్టాలన్నా, చెరువు తవ్వాలన్నా అందరం కలిసే చేశారని, కులం, వర్గం, ప్రాంతం అనే తేడాలు లేకుండా పండుగ వచ్చిందంటే కలిసి జరుపుకునే త త్వమే ఐక్యత అని సూచించారు. సమాజంలో ఎవరికి కష్టం వచ్చినా "మన వాడు" అని ఆదుకోవడం మన ధర్మమని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడడం, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడమే నిజమైన హిందుత్వం పేర్కొన్నారు. నేటి యువత చేతిలోనే భవిష్యత్తు ఉందని, వారు చదువులో ముందుండాలని, టెక్నాలజీలో దూసుకుపోవాలి ఆకాంక్షించారు వర్కల క్రిష్ట. ఈ సందర్భంగా స్థానిక శ్రీవిధ్యానికేతన్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు రామ్ డ్యాన్స్ అకాడమీ సౌజన్యంతో ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు సమ్మేళనానికి హాజరైన ప్రతి ఒక్కరి మనస్సు దోచాయి. చిన్నారుల్లోని దేశ భక్తిని, భారత దేశ ఔనత్యాన్ని చాటిన మహానీయుల చరిత్రను కళ్లకు కట్టిందని చెప్పవచ్చు. హిందూ సమ్మేళనం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు వలకొండ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి సిద్దిరాల సంతోష్, కోశాధికారి చెన్న శ్రీమ్, మల్లేష్ కురుమ , స్థానిక నాయకులు చేడం వెంకటరమణ గుప్త, సోమ శ్రీనివాస్ గుప్త, ఎస్. వెంకటేష్ కురుమ, సంతోష్ గౌడ్, రమేష్ రెడ్డి, శంకర్, శివకుమార్, నరేష్, శివరాజ్, రాజ్ కుమార్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కిస్మాత్‌పూర్‌లో ఘనంగా
# హిందూ ధర్మ సమ్మేళనం

**హిందూ ధర్మం విశిష్టతను తెలుసుకోవాలి..**

**హిందువులు ఐకమత్యంగా ముందుకు సాగాలి..**

**రాజేంద్రనగర్(కిస్మత్పూర్),ఏప్రిల్19(ప్రభాత ఉదయం)**

సమాజ శ్రేయస్సు కోసం హిందువులు ఏకతాటిపై నడవాలని జగద్గిరిగుట్ట కేదరీనాథ్ క్షేత్ర దిపతి శివరుద్ర సాధువు,విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ సత్సంగ్ ప్రమోద్ పండరీనాథ్,ఎంజీఐటి ప్రొఫెసర్ సుధారాణి,లు పేర్కొన్నారు.ఆదివారం కిస్మాత్ పూర్ లో హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రాంతాలకు చెందిన వేల మంది హిందూ సోదరీ,సోదరులు తరలివచ్చారు.ఈ హిందూ మహాసమ్మేళనానికి ముఖ్యఅతిథిగా జగద్గిరిగుట్ట కేదరీనాథ్ క్షేత్ర దిపతి శివరుద్ర సాధువు, విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ సత్సంగ్ ప్రమోద్ పండరీనాథ్,ఎంజీఐటి ప్రొఫెసర్ సుధారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పురాణాలు,ఇతిహాసాలు, సంప్రదాయాల ప్రభావంతో సనాతన ధర్మం ప్రారంభమైందని,ఈ సనాతన ధర్మం ప్రతి రూపమే హిందూ సమ్మేళనం అన్నారు.ముఖ్యంగా సనాతన ధర్మం పాటించినప్పుడే సమాజం బాగుంటుందన్నారు.హిందూ ధర్మం విశిష్టతను ప్రతి భారతీయుడు తెలుసుకోవాలనిహావారు సూచించారు. హిందువులంతా సంఘటితమైతే సమీప భవిష్యత్‌లో భారత్ విశ్వగురుస్థానంతో పూర్వవైభవాన్ని సంతరించుకోవడం ఖాయమన్నారు.ఇప్పటికే కొంత మంది వారి విధానాల కోసం ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.అందులో యువత ముందుకు రావడంతో వారి విధానాలకు బానిసలుగా మారుతున్నారని పేర్కొన్నారు.ఇలాంటి విధానాలు మంచివి కావన్నారు.రోజురోజుకు దేశంలో హిందువులపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, అదేవిధంగా గోహత్యలు,మతమార్పిడి వంటివి జరుగుతున్నాయని అలాంటివి ఆపాలంటే ప్రతి ఒక్కరూ సంకల్పంతో కలిసిమెలిసి ముందుకు సాగాలని సూచించారు.హిందువు అనేది ఒక మతం కాదు ఒక జాతి అని అన్నారు.ప్రపంచంలో అత్యంత గొప్ప నాగరికత భారతదేశానిది అని అన్నారు. భారతదేశంలో ఉన్న సనాతన హిందూ ధర్మం గొప్పదనం ప్రపంచానికే తెలిసిందన్నారు.అయితే ఇంత గొప్పదేశంలో పుట్టిన మనకు దేశ ఔనత్యం గురించి తెలియదన్నారు. ప్రపంచం బాగుండాలని,అన్ని దేశాలు బాగుండాలని, మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు.మహాభారత, భగవద్గితను చదివి అహింసను వదలాలన్నారు.

# కేసీఆర్ సభకు భారీగా తరలి రావాలి

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్**

**కేసీఆర్ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర**

**రాజేంద్రనగర్,ఏప్రిల్19(ప్రభాత ఉదయం)**



ఈనెల 20వ తేదీన జగిత్యాలలో జరుగనున్న కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు.ఆదివారం బాబుల్ రెడ్డినగర్ లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్.వెంకటేష్ మాట్లాడారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో ఆదర్శవంతమైన పాలన అందించారని తెలిపారు.బీఆర్ఎస్ ఆధినేత కేసీఆర్ జగిత్యాల బహిరంగ సభను అడ్డుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం,అత్యంత నీచమైన కుట్రలకు పాల్పడుతున్నారని ఎస్.వెంకటేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అనేక పోరాటాలు చేసి తన ప్రాణాలను పణంగా పెట్టి , అమరవీరుల త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ గొప్ప పరిపాలనాదక్షకుడని పేర్కొన్నారు.కేసీఆర్ విజన్ దేశానికే ఆదర్శమని కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభ అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని వివరించారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.ఇచ్చిన హామీల గురించి నిలదీస్తే బీఆర్ఎస్ నాయకులను వేదింపులకు గురిచేస్తూ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో ప్రజలు మళ్లీ సంతోషంగా ఉ ండాలంటే రేవంత్ పోవాలి..కేసీఆర్ రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని తెలిపారు.ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగిత్యాల సభను లక్షలాది మందితో విజయవంతం చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.




## ప్రతి కార్మికుడికి లేబర్,
# ఈ శ్రమ కార్డు అందజేస్తాం

**సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

ప్రతి కార్మికుడు కార్మిక శాఖ అందజేసే లేబర్ కార్డు ఈశ్రమ కార్డ్ అప్లై చేసుకుని వాటి బెన్ఫిట్ సద్వినియోగం చేసుకోవాలని సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆదివారం ఏఐటియుసి, తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాజేంద్రనగర్ మండలం సమితి ఆధ్వర్యంలో సిపిఐ ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో లేబర్ కార్డులు , ఈశ్రమ కార్డులకు అప్లై చేయించారు.ఈ కార్యక్రమం ఏఐటియుసి రాజేంద్రనగర్ మండలం ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాజా అధ్యక్షతన ఎఆర్ దేవరాజ్ భవన్ లో జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులు రాజేంద్రనగర్ మండలంలో వివిధ లేబర్ అడ్డాలో లేబర్ కార్డు లేకుండా చాలా మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని భవన నిర్మాణ కార్మికులు అందరూ లేబర్ కార్డులు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మికులు ఎలా లబ్ధి పొందాలో వారు వివరించారు భవన నిర్మాణం కార్మికులు లేబర్ అడ్డాలు మండలంలో చింతల్ మెట్ శివరాంపల్లి రాజేంద్రనగర్ లేబర్ అడ్డా హైదర్గూడా లేబర్ అడ్డా బుద్వేల్ లేబర్ అడ్డాల నుంచి భవన నిర్మాణ కార్మికులకు రాజేంద్రనగర్ మండల సిపిఐ , బిఓసి తరఫున ల60 మందికి లేబర్ కార్డులు అప్లై చేయించడం జరిగిందన్నారు. గతంలో అప్లై చేయించుకున్న వారికి లేబర్ కార్డులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్ కార్యాలయం కార్యదర్శి జి సత్యం మండల కౌన్సిల్ సభ్యులు జే సదానంద గౌడ్ మధు భారత జాతీయ మహిళా సమైక్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ మండల ఉపాధ్యక్షురాలు కుక్కునూరు వాణి ఏఐటియుసి మండల అధ్యక్షులు ఎండి సలీం భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు



## ఆదివారం క్లాసులు నడిపిస్తున్న
# యాజమాన్యంపై
# పోలీస్ స్టేషన్లో పిర్యాదు

**దేవరుప్పుల ఎంఈఓ కళావతిపై**

**దాడికి ప్రయత్నించిన పాఠశాల కరస్పాండెంట్**

**తల్లిదండ్రుల నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు పాఠశాలను తనిఖీ చేసిన దేవరుప్పుల ఎంఈఓ కళావతి**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

జిల్లాలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో ఆదివారం సెలవు రోజు ఉన్నప్పటికీ క్లాసులు నడిపిస్తున్నారన్న తల్లిదండ్రుల పిర్యాదు మేరకు పాఠశాల తనిఖీకి వచ్చిన మండల విద్యాశాఖ అధికారి కళావతి సెల్ లాక్కొని దురుసుగా ప్రవర్తించి దాడికి ప్రయత్నించిన సంఘటన పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం ఎఫ్ఆర్ఐ నమోదైనట్లు దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్ తెలిపారు. ఎంఈఓ కళావతి, ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండల విద్యాశాఖ అధికారి జి.కళావతి దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలఏసు ప్రవేట్ పాఠశాల యందు ఆదివారం క్లాసులు నడిపిస్తున్నట్టుగా తల్లిదండ్రుల నుండి చాలా సార్లు ఫిర్యాదు వచ్చిన కారణంగా దాన్ని నిర్ధారించు కోవడానికి 2026 ఏప్రిల్ 19వ తేదీన ధ్రువీకరణ కొరకు వెళ్లగా అక్కడ రామకృష్ణ అనే ఉపాధ్యాయుడు పాఠం చెబుతూ ఉన్నాడని తెలిపారు. వెంటనే తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడుతుండగా పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు తరగతి గదిలోకి వచ్చి మీరు ఈమెతో మాట్లాడవద్దు వెంటనే వెళ్లిపోండని పిల్లలను పంపించి నువ్వు ఎవరు ఇక్కడికి రావడానికి ఇది నా ఇల్లు నా ఇష్టం అంటూ దాడికి ప్రయత్నించాడని తెలిపారు. ఎంఈఓతో కలిసి వెళ్లిన సిఆర్పి యాకస్వామి దాడిని అడ్డుకోవడానికి పోగా నీకు మేడం నాకు కాదు అంటూ దుర్భాషలా డుతూ ఫొటోస్ తీస్తున్న సిఆర్పి చేతి నుండి ఫోన్ లాక్కున్నాడని తెలిపారు. ఈ సంఘటన పై స్థానిక ఎస్ఐకి ఫోన్ చేయమని ఎంఈఓ కళావతి సిఆర్పికి చెప్పగా నా ఫోన్ కూడా లాక్కొని పగలగొట్టే ప్రయత్నం చేశాడని సిఆర్పి ఎంఈఓ తో చెప్పగా కరస్పాండెంట్ జేసుదాస్ నువ్వు ఒక లేడీ వా..? అంటూ అసభ్యంగా మాట్లాడుతూ నీ సంగతి చెబుతాను అంటూ బెదిరించాడని తెలిపారు. ప్రభుత్వ అధికారినైనా నన్ను నా విధులను ఆటంకపరిచి దుర్భాషలాడి బెదిరించిన స్కూల్ కరస్పాండెంట్ జేసుదాస్ పై చట్టరీత్యా చర్య తీసుకోవాలని పోలీసు స్టేషన్లో పిర్యాదు చేశారు. దీని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నామని దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్ తెలిపారు.





ఏకో రైజ్ ప్రాజెక్ట్ ను ప్రారంభించిన శ్రీ చిన జీయర్ స్వామీ

# ఎకోరైజ్ ప్రాజెక్టును
# ప్రారంభించిన శ్రీ చిన జీయర్ స్వామి

**శ్రీనివాస కన్ స్ట్రక్షన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ గగన్ పహాడ్ లో ప్రారంభం.. అందరికి అందుబాటులో నాణ్యమైన సదుపాయాలు**

**బుద్వేల్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

నగర శివారులోని రాజేంద్రనగర్ గగన్ పహాడ్ లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ శ్రీనివాస కన్ స్ట్రక్షన్ ప్రతిష్టాత్మక నివాస ప్రాజెక్టు ఎకోరైజ్ కు ఆధివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. శ్రీ త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి దివ్య సమక్షంలో వారి మంగళాశాసనాలతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చినజీయర్ స్వామి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు మంచి ఇల్లు కోరుకుంటారని, అయితే నిజమైన ప్రశాంతత మనస్సులో నుంచే రావాలన్నారు. ఆ ప్రశాంతతను కలిగించే వాతావరణం కలిగిన ఇళ్లు నిర్మించడమే ముఖ్యమన్నారు. ఆదివారం పరశురామ జయంతి, సోమవారం అక్షయ తృతీయ ఇంతటి పుణ్యదినాలలో ఇలాంటి శుభ కార్యాన్ని ప్రారంభించడం శ్రేయస్కరమని ఆశీర్వదించారు. ఆనంతరం నిర్వాహకులు ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రకృతి సౌం దర్యం, ఆధునిక సౌకర్యాల సమ్మిళితంగా రూపుదిద్దుకుంటులన్న ఈ ఎకోరైజ్ ప్రాజెక్టు ఆకర్శణీయంగా నిలుస్తోందన్నారు. 5.24 ఎకరాల విస్తీర్ణంలో 516 యూనిట్లతో తక్కువ జన సాంద్రతతో ప్రణాళిక రూపొం దించడం జరిగిందన్నారు. 100శాతం వాస్తు ప్రమాణాలతో 3, 4 బీహెచ్ కే ప్లాట్లు, 2,250 నుంచి 4,695 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాటు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రాజెక్టులో పచ్చదనానికి పెద్ద పీట వేస్తు 1.2 ఎకరాలలో ల్యాండ్ స్కేపింగ్. 33.000 చదరపు అడుగులు స్కై గార్డెన్స్ ను ఏర్పాటు చేసు బి న్నామన్నారు. అదనంగా 57,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీప్లస్ 7 అంతస్థులతో గ్రాండ్ క్లబ్ హైజ్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. తక్కువ ఖర్చుతో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తు ప్రజల అవసరాలను దృ ష్టిలో పెటుకొని మరింత విస్తరణ కు కృషి చేస్తున్నామన్నారు.



డాక్టర్ సల్లా సౌజన్యను సన్మానిస్తున్న బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు

# డాక్టర్ సల్లా సౌజన్యకు అభినందనలు

**బుద్వేల్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

చట్ట సభల్లో బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేధిక వద్ద నిరసన తెలిపి తిరిగి నగరానికి తిరిగి వచ్చిన ప్రొఫెసర్ జయశంకర్ తెలం గాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య ను బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల నాయకులు ఆదివారం సన్మానించారు. బీసీ మహిళల రాజకీయ హక్కులు, సముచిత ప్రాతినిధ్యం కోసం ఆమె ప్రదర్శించిన ధైర్య సాహసాలు, నిబద్ధత, పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ వర్శిటీ పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రూపావత్ హరిప్రసాద్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఐసీసీ అగ్రి ప్రొఫెషనల్స్ మాజీ డిప్యూటీ హెడ్ ...

# ఘనంగా కవులు కళాకారుల ఐక్యవేదిక ఏడవ వార్షికోత్సవం

## కవులు కళాకారుల కలయిక అపూర్వం

## తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం):**

కవులు కళాకారుల ఐక్యవేదిక ఏడవ వార్షికోత్సవం జిల్లా కేంద్రం లోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘనంగా నిర్వహించారు. కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు జి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, విశిష్ట అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, గౌరవ అతిథిగా ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి, ఆత్మీయ అతిథిగా తెలంగాణ అసెంబ్లీ సహాయ కార్యదర్శి బేతి వీరారెడ్డి పాల్గొన్నారు. మూడు ప్రధాన కార్యక్రమంలో తొలుత ఐక్యవేదిక ఏడవ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను నామోజు బాలాచారి ఆవిష్కరించారు. కవులు కళాకారుల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి పెట్లోజు సోమేశ్వరాచారి కార్యదర్శి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా నామోజు బాలా చారి మాట్లాడుతూ కవులు కళాకారుల కలయిక అనేది ఒక అపూర్వ ఘట్టమని వీరిని ఏకతాటికి తీసుకొని వచ్చి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప కార్యక్రమం అన్నారు. ప్రముఖ కవయిత్రి నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ సమాజ ఉన్నతికి పాటుపడే నిస్వార్థపరులు కవులు కళాకారులని వారిని ప్రోత్సహించడం మన బాధ్యత అన్నారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ కవితల పోటీలలో గెలుపొందిన ఐదుగురు విజేతలకు నగదు పారితోషకం, ప్రశంస పత్రం, మెమొంటో, శాలువాతో సత్కరించారు. సెయింట్ మేరీస్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకర్షించాయి. కవులు కళాకారుల ఐక్యవేదిక ఏడవ వార్షికోత్సవం సందర్భంగా 18 మంది విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు 18 సంస్థల తరఫున అందించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, సాదిక్ అలీ, దేవేందర్, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, నెల్లుట్ల రవీందర్ రావు, రేణుకట్ల మురళి, అంకాల సోమయ్య, ఒగ్గు రవి, మాన్యపు భుజేందర్, గజవెల్లి ప్రతాప్, లక్ష్మీనారాయణ భాగవతర్, నల్లా అరుణ, వజ్రోజు వెంకటాచారి, రాగల్ల ఉపేందర్, మోహన్ బైరాగి, అయిలా సోమ నరసింహచారి, లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, గడ్డం మనోజ్ కుమార్, డాక్టర్ వేముల సదానందం, చిలుమోజు సాయికిరణ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, రంగరాజు ప్రసాద్, పానుగంటి రామమూర్తి, మసురం రాజేంద్రప్రసాద్, పోరెడ్డి రంగయ్య, సాంబరాజు యాదగిరి, నక్క సురేష్, చింత ప్రసాద్, జోగు సుదర్శన్, విరాగి, తాటి హరీష్, దశరథ్ కొత్తపల్లి ప్రియాంక, సబితా, వివిధ సంస్థల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న కవులు, కళాకారులు



# నగరం నడిబొడ్డున కోట్ల విలువ చేసే భూమి హాంఫట్

## చోద్యం చూస్తున్న ఇరిగేషన్ శాఖ

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం నడిబొడ్డున ఎంతో విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుంటే, సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు చోద్యం చూడటం విచారకరం. కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూమిని కబ్జాదారులు హాంఫట్ చేస్తుంటే, అధికారులు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటి? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జూరాల ప్రాజెక్టు కుడి కాలువ గద్వాల పట్టణంలో సుమారు 4 కి.మీ. మేర ప్రవహిస్తోంది. గతంలో జూరాల కుడి కాలువ నిర్మాణం కొరకు సేకరించిన సాగునీటి శాఖ ఖాళీ స్థలా లపై కబ్జాదారులు కన్నేశారు. కాల్వకు రెండు వైపులా గతంలో తవ్విన మట్టి నిల్వ, కాల్వ పటిష్టతకు నిర్మాణాలకు అద నంగా స్థలాన్ని సేకరించారు. రెండు వైపులా ఉన్న సాగునీటి శాఖ ఖాళీ స్థలాలను గృహ, వాణిజ్య నిర్మాణాల పేరుతో కబ్జా చేస్తున్నా అధికారులు దృష్టి సారించడం లేదని విమ ర్శలు వ్యక్తమవుతు న్నాయి. డిసెంబర్ 2020లో ఇరిగేషన్ అధికారులు కాలువ కోసం సేకరించిన స్థలాలను గుర్తించి మార్కింగ్ వేసి వదిలేశారు. అతర్వాత కబ్జారాయుళ్లు తాజాగా ఇరిగేషన్ శాఖ ఖాళీ స్థలాలకు పేక్ సర్టిఫికెట్లు సేకరించి ఇతరులకు విక్రయించడంతో అక్రమార్కులు ఇరిగేషన్ స్థలంలో భవన నిర్మాణాల పనులు చేపట్టడం పట్టణ ప్రజలు ఆశ్చర్యానికి గురి చేసింది. కోట్ల విలువైన ఇరిగేషన్ భూమి కబ్జా అవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? ఇది అధికారుల అసమర్థతా? లేక అక్రమార్కులతో కుమ్మక్కయ్యారా? వెంటనే విచారణ జరిపి, ప్రభుత్వ భూమిని కాపాడాలి అని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# కరాటే ఫెడరేషన్ ఆఫ్ షూటోకాన్ బెల్ట్ గ్రేటింగ్ టెస్ట్

## తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ తాజుద్దీన్ నిర్వహణతో బెల్ట్ ఎగ్జామ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

జిల్లా కేంద్రంలోనిశారదవిద్యానికేతన్ స్కూల్లోని కరాటే బెల్ట్ ఎగ్జామ్ ఎస్ ఓ బషీర్ అహ్మద్, ఫుట్బాల్ కోచ్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించారు. సీనియర్ కరాటే మాస్టర్ షఫీ, మునీర్ ఆధ్వర్యంలో బెల్ట్ ఎగ్జామ్ జోగులాంబ గద్వాల జిల్లాలోని శారదవిద్యానికేతన్ స్కూల్లోని కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించరు. కరాటే బెల్ట్ ఎగ్జామ్ లో 12 మంది పిల్లలు పాల్గొనడం జరిగింది. ఇది జరిగినటువంటి బెల్టింగ్ గ్రాటింగ్ టెస్ట్ లో 12 మంది పిల్లలను సర్టిఫికెట్స్ లతో వారిని ప్రోత్సహించి కరాటే శిక్షణ నైపుణ్యాలను కృషి తో విలువలను కలిగి ఉండేలా అభివృద్ధి చెందాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ తాజుద్దీన్, టోర్నమెంట్ ఇంచార్జ్ , మోయిస్ మాస్టర్ మునీర్ షఫీ తదితరులు పాల్గొనడం జరిగింది.



# సరిహద్దులో... హద్దులే లేవు

## యధేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ రవాణ

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

తెలంగాణ –కర్ణాటక సరిహద్దులో అక్రమ ఇసుక రవాణకు హద్దులే లేవు. అక్రమార్కులు పగలు రాత్రి అని తేడా లేకడా దర్జాగా ఇసుకను రవాణ చేస్తున్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య అక్రమ ఇసుక వాహనాలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. కర్ణాటక నుంచి ధరూర్, కేటిదొడ్డి సరిహద్దు గ్రామాలలో నిత్యం పట్టపగలే అక్రమ ఇసుక రవాణ నడుస్తోంది. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాలోని కృష్ణానదీ తీర ప్రాంతాలైన సజ్జపురం, యాపల్ దిన్నె, గాజులపాడు ప్రాంతాల నుంచి ధరూర్, కేటిదొడ్డి మండలాలకు అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత ప్రభుత్వ విభాగాలు నిఘా పెట్టకపోవడంతోనే కొందరు ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సరిహద్దు మండలాలో గల నెట్టెంపాడు, ఈర్లబండ, ద్యాగర్ దొడ్డి, నీళ్లహళ్లి, పాతపాలెం, పాగుంటా , వెంకటాపురం, ఇర్కిచేడు , గువ్వలదిన్నె, తదితర గ్రామాలలో అధికారుల నిఘా కరువైందని, దీంతో ఇసుకాసురులు రాజ్యమేలుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కర్ణాటక నుంచి అక్రమ ఇసుక రవాణను అడ్డుకోవల్సిందిగా పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



# నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావ సభకు పెద్దఎత్తున తరలిరండి

## పార్టీ ఆవిర్భావ సభ గోడపత్రికలను ఆవిష్కరించిన...గొంగళ్ళ రంజిత్ కుమార్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ గడ్డపై ప్రజల పక్షాన నిబద్ధతతో పనిచేయడానికి ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ 25న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కలకుంట్ల కవిత నూతన పార్టీని ఆవిర్భవిస్తున్నారని పెద్ద ఎత్తున జరిగే ఇట్టి సభకు జోగులాంబ గద్వాల జిల్లా నుండి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎన్ హెచ్ పి ఎస్ జిల్లా చైర్మన్ , తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు గొంగళ్ల రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలోని మండల ముఖ్య నాయకులతో కలిసి అయన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ....అమరుల ఆశయ సాధన కోసం, సంపూర్ణ తెలంగాణ వికాసం కోసం సామాజిక తెలంగాణ, సర్వోదయ తెలంగాణ కోసం కృషి చేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి. కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని అధ్వయ కన్వెన్షన్ నందు నూతన రాజకీయ శక్తిగా రాజకీయ శక్తిగా రాజకీయ పార్టీగా పెద్ద ఎత్తున ఆవిర్భవించే సభకు జిల్లాలోని ప్రజలు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు వెంకట్రాములు, మల్దకల్, ధరూర్ మండలాల అధ్యక్షులు విష్ణు, నెట్టెంపాడు గోవిందు, పెంచికలపాడు, నాగర్ దొడ్డి గ్రామ సర్పంచులు ఆంజనేయులు, కృష్ణ, ఉప సర్పంచ్ గుండన్న, మండల నాయకులు ప్రేమ్ రాజ్, మీసాల కిష్టన్న, మునెప్ప, ఆంజనేయులు, సుభాష్, వీరేష్, చిన్న రాముడు, వెంకటేష్, రాము, సర్వేష్, భూపతి నాయుడు, శివన్న, వాసు, నేతన్న, అమ్రేష్, తిమ్మప్ప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# 20న రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల అవగాహన సదస్సులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

జిల్లాలోని రైతులందరికీ ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నేరుగా అందించడమే లక్ష్యంగా ఈనెల 20న మధ్యాహ్నం 3:00 గంటలకు జిల్లావ్యాప్తంగా అన్ని రైతు వేదికలలో "రైతు నేస్తం" కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి రెండో విడత "రైతు భరోసా" నిధులను బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమాన్ని రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత మరియు సాయిల్ హెల్త్ వాలంటీర్ల ద్వారా రైతులకు అందే సేవలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించబడుతుందన్నారు. రైతుల సమగ్ర సమాచారం, డిజిటల్ గుర్తింపు మరియు ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు ఉపయోగపడే 'అగ్రి స్టాక్ – ఫార్మర్స్ రిజిస్ట్రీ' నమోదు ప్రక్రియపై కూడా రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్నదాతలందరూ తమ సమీపంలోని రైతు వేదికల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజ్ఞప్తి చేశారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ మద్దతు

## బీజేపీ కుట్రలతో బిల్లు విగిపోయింది

## భారత దేశ అభివృద్ధిలో బిజెపి పార్టీ పాత్ర శూన్యం

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బిజెపి పాకిస్తాన్ తో పోల్చడం సరికాదు

## టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం):**

జిల్లా కేంద్రం లోని డీసీసీ కార్యాలయం లో టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ, దేశంలో ఇటీవల పార్లమెంట్‌లో చోటుచేసుకున్న పరిణామాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన చట్టాలు, డీలిమిటేషన్ బిల్లు అంశాలను ఒకదానితో ఒకటి లింక్ చేయడం ద్వారా రాజ్యాంగ సవరణల విషయంలో అనవసరమైన రాజకీయ కుతంత్రాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. భారతదేశంలో ఉన్న సగభాగం ఉన్న మహిళలకు బిజెపి పార్టీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పార్లమెంట్ లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కాకుండా బీసీ లకు ప్రాధాన్యత కల్పించకుండా బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. మహిళల గౌరవానికి సంబంధించిన అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం తగదని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. 2023లో మహిళా బిల్లు ఆమోదం పొందిన, బిజెపి మహిళా బిల్లును తిరిగి వివాదాస్పదంగా ముందుకు తేవడం పట్ల కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని వర్గాల న్యాయమైన హక్కుల కోసం ఎప్పటికీ పోరాడుతుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో సమానత్వం, సమృద్ధి సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతుందని అన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియలో బీసీలకు సరైన ప్రాతినిధ్యం ఇవ్వకుండా అన్యాయం జరుగుతోందని, అలాగే మహిళలలో కూడా బీసీ మహిళలకు సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ కులగణన ముఖ్యమంత్రి దేశానికే రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. బీజేపీ నాయకులు తెలంగాణపై విభిన్న వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో వారి వైఖరి స్పష్టతలేనిదిగా ఉందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని అవమానించే విధంగా ప్రవర్తిస్తున్న బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని, రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చైతన్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం పార్లమెంట్‌లో జరిగిన పరిణామాలపై బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత దేశం అభివృద్ధిలో బిజెపి పార్టీ పాత్ర శూన్యమని, తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని, సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చడం సరికాదని తెలంగాణపై బిజెపి ప్రభుత్వాలుకున్న కపట ప్రేమ తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా బిజెపిని తెలంగాణ నుండి తరిమికొట్టాలని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి పార్టీకి ఓటు అడిగే హక్కు లేదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్ పాల్గొని మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును తప్పుడు విధానంలో ముందుకు తీసుకురావడం వల్లే అసలు లక్ష్యాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. అలాగే డీలిమిటేషన్ ప్రక్రియలో బీసీలకు స్పష్టమైన రిజర్వేషన్ హామీ లేకపోవడం, వారి హక్కులను పక్కన పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం జరగాలని, రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం సమాన హక్కులు కల్పించాలని నిరంతరం పోరాడుతున్నారని, అయితే బీజేపీ ప్రభుత్వం ఈ అంశాలను రాజకీయ కుతంత్రాలుగా మార్చి ప్రజల మధ్య గందరగోళం సృష్టిస్తోందని విమర్శించారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యులు

# సైబరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం


## ఒక్క రోజే 315 మందిపై కేసులు

## మద్యం మత్తులో స్టీరింగ్ పడితే 10 ఏళ్ల జైలు శిక్ష తప్పదు

## ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 19, (ప్రభాత ఉదయం)**

రహదారులపై మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. వారాంతపు ప్రత్యేక తనిఖీల్లో భాగంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో శనివారం రాత్రి ఒక్కరోజే 315 మంది పట్టుబడ్డారు. వీరిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో పట్టుబడిన వారిలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులు ఉండటం గమనార్హం. ఇందులో 268 ద్విచక్ర వాహనదారులు 28 కారు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు.

నడుపుతున్న వారు 15 మంది ఆటో డ్రైవర్ల తోపాటు 04 భారీ వాహనాలు నడుపుతున్న వారు ఉన్నారు.

**హెల్మెట్ లేని ప్రయాణంపై నజర్**

డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కూడా సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు లైసెన్సుల రద్దుకు కూడా వెనుకాడబోమని డీసీపీ హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే నాన్ బైలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనివల్ల 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ హెచ్చరించారు.

**గత వారంలో కోర్టు తీర్పులు**

ఏప్రిల్ 13 నుంచి 18 వరకు నమోదైన కేసులను పరిశీలించిన కోర్టులు మొత్తం 120 డ్రంక్ డ్రైవింగ్ కేసులను పరిష్కరించాయి. ఇందులో ఒకరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించగా మిగిలిన 119 మందికి భారీ జరిమానాలు విధించినట్లు డీసీపీ వెల్లడించారు. రోడ్డు భద్రత దృష్ట్యా ప్రయాణికులు నిబంధనలు పాటించాలని ప్రాణాలను పణంగా పెట్టవద్దని పోలీసులు కోరుతున్నారు.





# ఏంఈఓ విధులకు ఆటంకం కలిగించిన బాలయేసు పాఠశాల కరెస్పాండెంట్ జేసురాజుపై చర్యలు తీసుకోవాలి

## సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నందున పాఠశాల పర్మిషన్ రద్దు చేయాలి

## జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి షరీఫ్, ఇప్ప రాంరెడ్డి

## డి టి ఎఫ్ జనగామ జిల్లా శాఖ

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం):**

జిల్లా లోని దేవరుప్పుల మండల విద్యాశాఖ అధికారి జి. కళావతి పై దాడి చేసి సెల్ఫోన్ లాక్కొని బెదిరించిన బాల యేసు ఇంగ్లీష్ మీడియం ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని" డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి షరీఫ్ ఇప్పరాంరెడ్డి, డిటిఎఫ్ జనగామ జిల్లా శాఖలు సంయుక్తంగా ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.దేవరుప్పుల మండల కేంద్రంలో ఆదివారం రోజు పాఠశాలలు నడుస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన సమాచారం మేరకు మండల విద్యాశాఖాధి కారి జి.కళావతి బాలయేసు ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలను సందర్శించి తరగతులు నిర్వహించబడుతున్న విషయాన్ని ధ్రువీకరణ చేసుకుంటున్న సమయంలో పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు ఏంఈఓ ను దుర్భాషలాడుతూ, సెల్ఫోన్ లాక్కొని బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎంఇఓ తో వచ్చిన సిఆర్పి యాకస్వామి ఫోన్ కూడా లాక్కొని బెదిరించారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో పాఠశాలను నడపడమే కాకుండా, మండల విద్యా శాఖాధి కారి విధులకు ఆటంకం కలిగించిన బాలయేసు పాఠశాల కరెస్పాండెంట్ జేసురాజు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పాఠశాల పర్మిషన్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.



సమాచార , పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పీఆర్వో సుభాష్

# జలమండలికి మూడు పీఆర్ఎస్ఐ అవార్డులు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతుంది. ఈ ఏడాది ఇప్పటికే పలు అవార్డులు గెలుచుకున్న జలమండలి... తాజాగా మరో మూడింటిని తన ఖాతాలో వేసుకుంది. పీఆర్ఎస్ఐ (పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా) తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్-తెలంగాణ రైజింగ్-2047 భాగంగా సొసైటీ నిర్వహించిన కాన్ఫరెన్స్ లో జలమండలికి మూడు బహుమతులు లభించాయి.ఓఆర్ఆర్ పరిధిలో భూగర్భ జలాల పెంపునకు అవగాహన కోసం బ్రోచర్ రూపొందించిన జలమండలి.. వివిధ మాధ్యమాల్లో ప్రజలకు అవగాహన కల్పించింది.. దానికి మొదటి బహుమతి లభించింది.సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ-హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్ పైన రూపొందించిన డాక్యుమెంటరీకి కార్పొరేట్ వీడియో ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ఫీచర్ విభాగంలో ద్వితీయ బహుమతి లభించింది.అలాగే ఇంకుడు గుంతల నిర్మాణంపై సాంకేతిక సమాచారంతో వివరణాత్మకంగా రూపొందించిన పోస్టర్ కు “బెస్ట్ లేఅవుట్ ఽ డిజైన్” కేటగిరీలో ద్వితీయ బహుమతిలభించింది.హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఆదివారం జరిగిన పీఆర్ఎస్ఐ తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ లో విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సమాచార , పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక ఐఏఎస్, ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిసి జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పీఆర్వో సుభాష్, గ్రౌండ్ వాటర్ ఎక్స్పర్ట్ సత్యనారాయణకు ఈ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ.. దీనికోసం కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

# భారత్‌తో మా బంధం అత్యంత దృఢం అంటున్న ఇరాన్

## హార్ముజ్ జలసంధిలో భారత నౌకలపై కాల్పులు తర్వాత కామెంట్లు..

## 5 వేల ఏళ్ల నాటి బంధం ఈ దాడులతో నాశనం కాదంటూ వెల్లడి

**ఇరాన్ , ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

హార్ముజ్ జలసంధిని దాటేందుకు ప్రయత్నించిన రెండు భారతీయ నౌకలపై కాల్పులు జరిపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే అదృష్టవశాత్తు ఈ కాల్పుల్లో నౌకలోని ట్యాంకర్లు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలుస్తుండగా.. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూనే.. భారత్‌లోని ఇరాన్ రాయబారికి సమన్లు జారీ చేసింది. ఈక్రమంలోనే తాజాగా ఇరాన్ కూడా ఈ దాడులపై స్పందించింది. తాము ఇండియాను లక్ష్యంగా చేసుకోలేదని, తమకు మద్దతు ఇవ్వని దేశాలపైనే దాడులకు పాల్పడుతున్నట్లు స్పష్టం చేసింది. అలాగే భారత దేశంతో తమ బంధం అత్యంత దృఢంగా ఉందని చెప్పింది.

శనివారం ఉదయం ముడి చమురుతో ప్రయాణిస్తున్న రెండు భారతీయ నౌకలు హార్ముజ్ జలసంధి గుండా వెళ్తుండగా ఇరాన్ మిలిటరీ బలగాలు వాటిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపాయి. ఈ ఊహించని దాడితో అప్రమత్తమైన నౌకలు తమ దిశను మార్చుకుని వెనక్కి తిరిగాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగక పోయినప్పటికీ.. అంతర్జాతీయ జలాల్లో వాణిజ్య నౌకల భద్రతపై ఇది తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది.



**భారత్ ఘాటు నిరసన.. రాయబారికి సమన్లు**

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన భారత విదేశాంగ శాఖ.. ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి గట్టి హెచ్చరికలు జారీ చేసింది. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ సందర్భంగా భారత్ తరపున తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నౌకల భద్రత, నావికుల రక్షణ విషయంలో భారత్ రాజీ పడదని స్పష్టం చేశారు. గతంలో భారత్‌కు వస్తున్న నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సహకరించిందని గుర్తు చేస్తూ.. తక్షణమే ఈ ఉద్రిక్తతలను తగ్గించి సాధారణ స్థితిని పునరుద్ధరించాలని కోరారు.

**“మా బంధం 5 వేల ఏళ్ల నాటిది”: డాక్టర్ అబ్దుల్ మజిద్ ఇలాహి**

ఈ ఉద్రిక్తతల మధ్య భారత్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజిద్ హకీమ్ ఇలాహి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. జాతీయ వార్తా సంస్థతో మాట్లాడిన ఆయన.. భారత్, ఈరాన్ మధ్య సంబంధాలు “అత్యంత దృఢంగా” ఉన్నాయని ఉద్ఘాటించారు. “మా మధ్య ఉన్న బంధం కేవలం రాజకీయమైనది కాదు. ఇది 5 వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతి, నాగరికతతో ముడిపడి ఉంది. భారత్ ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌ల మధ్య చర్చలు విజయవంతంగా సాగాయి” అని ఆయన పేర్కొన్నారు. నౌకలపై కాల్పుల ఘటన గురించి తనకు పూర్తి వివరాలు తెలియవని, అయితే ఈ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

# ఈ నెల 22 నుంచి ఆర్టీసీ డిపోల ముందు నిర్వహించే కార్మికుల నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలి

**బుద్వేల్, ఏప్రిల్ 19 (ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లాలో ఉన్నటువంటి అన్ని ఆర్టీసీ బస్సు డిపోల ముందు ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పి రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆరు సంఘాలతో కాటేదాన్ లోని సీఐటీయు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయు) హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్ క్రిష్ణ అధ్యక్షతన జరిగింది. ఆర్టీసీ యాజమాన్యం సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రలకు వెళితే కార్మికులందరు ప్రతిఘటించాల్సిన అవసరం ఉం దాని పి రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టీసీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, తగిన వేతనాలు, పెన్షన్, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జె రుద్రకుమార్, ఏఐటీయుసీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహ్మారెడ్డి, సయ్యద్ ఖాజా, చుక్క మోహన్, కాలె రాజు, జిఎం చైతన్య తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు మెరుగుపరుస్తాం

## మంత్రి శ్రీహరి

## విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తాం:ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర , ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

నియోజకవర్గంలోని కౌకుంట్ల మండలం పేరూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల 75 ఏళ్ల డైమండ్ జూబ్లీ వేడుకలలో మంత్రి వాకిటి శ్రీహరి , స్థానిక సర్పంచ్ శృతి అరవింద రెడ్డి , గ్రామ పెద్దలు బసి రెడ్డి తదితరులతో కలిసి పాల్గొని పూర్వ విద్యార్థులకు, గ్రామస్తులకు, ఉపాధ్యాయులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సిల్వర్ జూబ్లీ శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ వివిధ గ్రామాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు 60 సైకిళ్లను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... విద్య గురించి తెలియని రోజుల్లో, విద్యకు ఉన్న ప్రాధాన్యత గుర్తించి ఆనాడు 1950వ సంవత్సరంలో పేరూరు గ్రామ పెద్దలు, మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ కే.కే రెడ్డి పేరూర్ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయించారని వారి సేవలను కొనియాడారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు, పేరూరు పాఠశాలలో మ్యాథమెటిక్స్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని, అదేవిధంగా పాఠశాల వద్ద మిని స్టేడియం మంజూరు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి ని కోరారు.ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మంత్రి పేరూరు గ్రామానికి మినీ స్టేడియం మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.

# కాంగ్రెస్ నిరక్షరాస్యుల పార్టీ..

## మరోసారి తేజస్వి సూర్య వివాదస్పద వ్యాఖ్యలు

**ఇరాన్ , ఏప్రిల్ 19(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యలపై రేగుతున్న దుమారంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మరోసారి వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే తన మాటలను వక్రీకరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. నేను లోక్‌సభలో ఏం మాట్లాడానో మరోసారి కాంగ్రెస్ నేతలు శ్రద్ధగా వినాలి. నా మాటల్లోని అసలు అర్థాన్ని తెలుసుకోకుండా రాద్ధాంతం చేయడం సరికాదు. నేను మాట్లాడినవి చాలా సింపుల్ మాటలు. వీలైతే వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి అని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని “నిరక్షరాస్యుల పార్టీ”గా అభివర్ణిస్తూ తేజస్వి సూర్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు ఉద్దేశపూర్వకంగా, లేదా అజ్ఞానంతోనే ఈ నిరసనలు చేస్తున్నారు. నా మాటలను తప్పుగా అర్థం చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు అని తేజస్వి సూర్య కీలక వ్యాఖ్యలు చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608